# సాహితీ సదస్సు - సభా భయం

శ్యామలాదేవి దశిక, North Brunswick, NJ

ఎప్పుడో నాలుగేళ్ళక్రితం ముచ్చటగా ఓ నాలుగు అమెరికా ఇల్లాలి ముచ్చట్లు రాసుకున్నాక, వీటికి ఓ బొమ్మ వుంటే బావుండూ అనిపించింది. ఆ ప్రయత్నంలో భాగంగా వంగూరి చిట్టెన్ రాజుగార్ని సంప్రదించాల్సివచ్చింది. ఎవరో చెప్పారు ఆయన దగ్గర ఒక్క బాపుగారి నెంబరేకాదు బ్రహ్మదేముడి నెంబరుతో సహా అందరి జాతకాలు ఉంటాయని! ఈ వెయ్యిగుళ్ళపూజారిని అందులోను "మోస్టు ఇన్ఫ్లుయెన్సుడు" మాన్ని పట్టుకోవడం ఎలాగా అనుకున్నాను. ఎందుకంటే నేనెవరో ఆయనకు తెలీదు. ఒకవేళ తెలిసినా నాలాంటి చిన్నా చితకా వాళ్ళ సంగతి చూడ్డానికి ఆయనకు టైము వుండదేమో అని సందేహపడ్తూ, ఓ ఈమైల్ కొట్టి చూద్దాం అని ట్రైచేసా. తర్వాత ఓ రెండురోజులకు గాని నాకు కంప్యూటర్ ముందు కూర్చోడానికి నాకు వీలుకాలేదు.

నేను అనుకున్నట్టు ఆయన బిజీ మాన్ కాదు ఏమి కాదు! అసలు ఆయనకు వేరే పనేంవుండదనుకుంటా! లేకపోతే అంత తక్కున సమాధానమివ్వడమేమిటి?

నిజంగా బిజీమానే అయితే నేనడిగిన దానికే సమాధానం ఇచ్చి ఊరుకోవచ్చుగా? దానితోపాటు 'ఈ ముచ్చట్లన్నీ ఓ పుస్తకంగా అచ్చేయించుకోకూడదూ?' అంటూ ఓ సలహా కూడా ఇచ్చారు! నేను వెంటనే 'అబ్బే ఇవి ఇక్కడి పత్రికలకి, ముఖ్యంగా మా తెలుగుజ్యోతి కోసం రాసుకున్నవి. పుస్తకం అచ్చేయించడం అంటే మాటలా? దాన్ని గురించి నాకు తెలియదు, మావారికి అంతకన్నా తెలీదు కనుక 'నాట్ ఇంటరెస్టెడ్' అని తిరుగు టపాలో రాసాను. పట్టువదలని విక్రమార్కుడిలా చిట్టెన్ రాజుగారు, 'నీకు తెలియకపోతేనేం, గిరీశం అంతటి వాడ్ని నేనున్నానుగా' అంటూ ఓ క్లాస్ తీసుకున్నారు.

ఈ సంగతి తెలిసి మావారు 'ఇకనేం, ఈ పుస్తకం ఐడియా బాగానేవుంది. టైపు చెయ్యడానికి నేనున్నాను., ప్రింటు చేయించడానికి రాజుగారు వున్నారు. ఎటొచ్చీ ఈ వున్నవి సరిపోవు. అర్జెంటుగా ఓ రెండు డజన్లు రాసేయ్' అంటూ ఆర్డరు జారీ చేశారు.

నేను వెంటనే, 'అబ్బే నాకంత టైమూ లేదు, మూడూ లేదు. ఉన్నట్టుండి అన్ని రాయాలంటే ఎలా కుదురుతుందీ' అన్నా కాస్త డబాయింపుగా! మావారు వెంటనే, 'రాయడానికి మూడెందుకూ? ఐడియాలు కావాలిగాని, పైగా ఇప్పుడు ఇంట్లోనేకదా వుంటున్నావు? టైము లేకపోవడమేమిటి?' అంటూ నా నిరుద్యోగపర్వాన్ని గుర్తుచేశారు.

ఇక అక్కడినుంచి రెండురోజులకోసారి రాస్తున్నావా? ఇప్పటికి ఎన్ని అయినాయి? ఎప్పటికి అవుతాయి? అంటూ వేపుకుతిన్నారు. ఈయన గోల పడలేక ఎలాగో అలా రాసాననిపించి ఓ కట్ట కాగితాలు ఆయన ముందు పడేశా!

ఇక మర్నాటినుంచి హాస్పిటల్ నుంచి రావడం తరువాయి, ఓ హలో లేదు, హౌ ఆర్ యు లేదు (కిస్సులు ఎలాగో లేవనుకోండి), రాముడు బుద్ధిమంతుడు అన్నట్టు సరాసరివెళ్ళి ఆ కంప్యూటర్ ముందు కూర్చోడం. మొదట వళ్ళు మండినా తరువాత సాయంకాలం వచ్చే నా తెలుగు సీరియల్స్ చూసుకోవడానికి వీలుగా వుందని సంతోషపడ్డా. కానీ ఆ సంతోషం ఎంతోసేపు నిలవల.

ఐదేసి నిమిషాలకోసారి 'పైకిరా' అని పిలవడం. అదేంటి? ఇదేంటి? ఇక్కడ ఇలా ఎందుకు రాసావూ?' అంటూ ఒకటే ప్రశ్నలడగటం మొదలుపెట్టారు.

ఓ రెండు రోజులు చూసిచూసి "ఇలా పైకి కిందకి అస్తమానం నేను తిరగలేను" అని విసుగు ప్రదర్శించా! ఆ తర్వాత నన్ను పిలవడం మానేశారు. హమ్మయ్య అనుకున్నాను.

మర్నాడు నా సీరియల్స్ చూసుకోవడానికి ముందు, చేసిన వంటకాలు టేబుల్ మీద పెట్టే ప్రయత్నంలో నేనుంటే వున్నట్టుండి మావారు కాగితాలకట్ట, లాప్‌టాప్‌తో బల్లమీద దుకాణం పెట్టేసి మావూళ్ళో గల్లాపెట్టె ముందు కూర్చుండే కనకరాజుకు మల్లే కుర్చీలో చతికలబడ్డారు! ఇక్కడుంటే తనకు ఇబ్బంది లేకుండా, ఎప్పుడంటే అప్పుడు నన్ను ఇబ్బంది పెట్టవచ్చని ఆలోచించి మరీ చేశారుట!

ఇలా ఆయన టైపు చెయ్యడం, నేను సరిదిద్దటం, నచ్చనివి తీసెయ్యడం, కొత్తవి యాడ్ చెయ్యడం- - - ఎలాగైతేనేం చివరకు అన్నీ పూర్తిచేసి చిట్టెన్ రాజుగారికి పంపించారు మావారు.

ఏకొద్ది రోజులపాటు నిరాటంకంగా నా సీరియల్స్ ఎంజాయ్ చేశానో. ఇక అటువైపునుంచి 'నీ కథలు ఇండియాలో టైపు చెయ్యడం అయిపోయింది. అందులో తప్పొప్పులు చూసుకొని వీలైనంత త్వరలో ముందుమాట, నీమాట, మీ ఆయన మాటా- - - వగైరా వగైరా పంపించు' అంటూ చిట్టెన్‌రాజుగారు తగులుకున్నారు.

మావారు మళ్ళీ విజృంభించారు. రాసావా? అన్ని తప్పులు సరిదిద్దావా?

రాజుగారికి సమాధానం ఇచ్చావా? ఆమాత్రం శ్రద్ధలేకపోతే ఎలా? అంటూ ఒకటే షంటుడు. ఈ పుస్తకం ఏదో ఈయనే రాసుకుంటే బావుండు. హాయిగా నా సీరియల్స్ నేను చూసుకుందును అని గొణుక్కున్నాను.

కొన్ని రోజులకు 'నీ పుస్తకం అచ్చయింది' అన్న వార్త విని అమ్మయ్య అనుకున్నాను. ఆ తర్వాత 'వచ్చేనెలలో ఇండినాపోలిసులో జరగబోయే ఏడవ ఉత్తర అమెరికా తెలుగు సాహితీ సదస్సులో నీ పుస్తక ఆవిష్కరణ చేస్తాం, ప్రయాణానికి సిద్ధం కండోచ్' అని అన్నారు! అప్పుడు మాత్రం నాకు భలే సంతోషం వేసింది!

నా పుస్తకం ఎప్పుడు చూస్తానా అనుకుంటూ పుస్తక ఆవిష్కరణ అంటే ఏం చేస్తారబ్బా అని ప్రశ్నించుకున్నాను. ఈ పుస్తక ఆవిష్కరణలో కొంపదీసి నన్ను మాట్లాడమని అనరుకదా అని అనుమానంతో కూడిన ప్రశ్న నన్ను భయపెట్టింది.

ఓ రెండు రోజులతర్వాత మెయిల్‌లో వచ్చిన నా పుస్తకం చూసుకుని మురిసిపోయిఆ సంతోషంలో చెట్టెన్‌రాజుగారికి ఫోన్ చేశా. ఎలాగోపిలిచాను కదా, పనిలోపని అని నా వెధవ అనుమానాన్ని బయటపెట్టా.

ఆయన వెంటనే 'అబ్బే ఆభయం ఏమీ అక్కరలేదు. నీ ఉపన్యాసం ఎవడిక్కావాలీ?" అని అంతటితో ఊరుకోకుండ "ఆ సమయంలో నువ్వు మాట్లాడేది ఏమీ ఉండదు. ఏమైనా వుంటే నేను మాట్లాడుతాను. నేనే మాట్లాడాలికూడా. అసలు రెండేళ్ళకోసారి నేను ఈ సాహితీ సదస్సులు పెట్టేదే అందుకూ" అంటూ ఓ చిన్న ఉపన్యాసం ఇచ్చారు.

బతికానురా భగవంతుడా అని అనుకొని అప్పుడు ధైర్యంగా, 'సదస్సులో కలుసుకుందాం గురువుగారు' అంటూ ఫోను పెట్టేయబోయాను. ఆయన వెంటనే 'అప్పుడేం మాట్టాడద్దు కానీ తర్వాత సాయంకాలం సదస్సులో నీకు నచ్చిన అంశం మీద ఓ 15 నిముషాలు మాట్లాడు' అంటూ ఠక్కున ఫోను పెట్టేశారు! చచ్చానురా దేవుడా అనుకున్నాను.

ఇక నాగుండెల్లో రైళ్ళు పరిగెత్తటం మొదలుపెట్టాయి. కారణం నాకు మాట్లాడటం అంటే అమిత భయం. నిజానికి మాట్లాడటమంటే భయం కాదు, నిలబడి అందర్నీ చూస్తూ మాట్లాడాలి అంటే భయం. అసలు నేను ఇలా తయారవడానికి కారణం నా చిన్నప్పటి మాస్టార్లే. అందులోనూ ముఖ్యంగా మా తెలుగు మాస్టారు. ఆయన ప్రతి రోజు ఇచ్చే పద్యాన్ని కళ్ళు కూరుకుపోతున్నా ఎలాగో అలాగ బట్టీ పట్టి, నిద్రలోకూడా వల్లె వేస్తూ పడుకునేదాన్ని. మనం పుస్తకాల్లో చదివినట్టు, సినిమాల్లో చూసినట్టు "అమ్మా పద్యం చెప్పు తల్లీ" అని అనొచ్చు కదా? కానీ మా తెలుగు మాస్టారు నరసింహశాస్త్రిగారు నిజంగానే నరసింహ రూపంతో, దానికితోడు ఉరిమినట్టుండే గొంతుతో "ఊ, పద్యం నేర్చుకున్నావా? ఏదీ చెప్పు చూద్దాం" అంటూ బెత్తం ఆడిస్తూ అడిగేవారు. ఆయన ఎదురుగుండా నిలుచుని చేతులు కట్టుకొని దిక్కులు చూడకుండా ఆయన ముఖంలోకి చూస్తూ చెప్పాలి. అసలే బక్కపీచులా వుండేనేనుఆయన్ను చూసీచూడటంతోటే వణికిచచ్చేదాన్ని. అలా నాకు చిన్నతనంనుంచే ఈ సభాభయం పట్టుకుంది.

అలాంటి నన్ను వున్నట్టుండి ఇలా మాట్లాడమంటే ఎలా? దానికితోడు ఎక్కడో కొత్తవూరు, కొత్తమొహాలు, అందులోనూ పెద్దసాహితీసదస్సులో--- పైగా దేనిగురించి మాట్లాడాలి? బుర్ర పనిచెయ్యడం మానేసింది. ఏం చెయ్యడంరా దేముడా అనుకుంటుంటే, ఇంతలో మాఅమ్మాయి ఫోన్ చేసింది. నాకేదన్నా ఉపాయం చెప్తుందన్న ఆశతో దానికి నా బాధ చెప్పుకున్నా.

అది వెంటనే " డోన్ట్ బి సిల్లీ! యూ విల్ డూ ఫైన్. జస్ట్ టెల్ దెమ్ వై యూ రోట్ ద బుక్ " అంటూ చివాట్లేస్తూ ఓ సలహా కూడా పారేసింది. సరే ఇదేదో బాగానేవుంది చూద్దాంలే అనుకున్నా.

కూతురిద్వారా విషయం తెలుసుకున్న మావారు వెంటనే రంగంలోకి దిగారు. "నువ్వు ఏంచెప్పదలుచుకున్నావో రాసుకో. అలా అయితే అక్కడ నీకు ఏం ప్రాబ్లెం వుండదు" అంటూ ఆయన ఇంకో ఉచిత సలహా ఇచ్చారు. సరే అన్నాను.

ఏదో సామెత చెప్పినట్టు రోట్లో తలపెట్టి రోకటిపోటుకు భయపడితే ఎలా? అనుకుని నాకు తోచినదేదో నాలుగు ముక్కలు కాగితం మీద రాసిపెట్టుకున్నాను. ఒకరోజు మావారు వున్నట్టుండి ఆఫీస్ నుంచి ఫోన్ చేశారు. ఏమిటీ అంటే ఆయన ఇంటికి రాగానే నేను నా స్పీచ్ వినిపించాలిట. విని ఎలా వుందో చెప్తారుట. నేనేమి ఈయన అభిప్రాయం కావాలని అడగలేదే అని మనసులో అనుకుని పైకి 'అలాగే చూద్దాం లెండి' అన్నా!

ఇంటికి రాగానే సుష్టుగా భోజనం లాగించి సోఫాలో కూలబడి కాళ్ళు బారజాచుకొని, టీవీ రిమోట్ చేతిలో పుచ్చుకుని "ఏదీ నీ ఉపన్యాసం వినిపించు" అంటూ మా తెలుగు మాస్టారల్లే దబాయిస్తూ అడిగారు.

నేను "మీముందు ప్రాక్టీసు చెయ్యటమేమిటీ నాబొంద. ఆ టైములో నామనసుకు ఏది తోస్తే అదే చెప్తాను" అన్నాను ఎలాగైనా తప్పించుకోవడానికి.

మావారు వెంటనే "ఇంకా నయం స్టేజీ ఎక్కాక ఆలోచిస్తానన్నావు కాదు. ఇప్పుడు క్షుణ్ణంగా ప్రిపేర్ అవ్వకపోతే అక్కడ బిగుసుకుపోయి నోటమాట రాకుండా అయి నువ్వే బాధపడతావు నాకేం" అంటూ సోఫాలోంచి లేచి వెళ్ళిపోయారు. అసలే లోపల భయంగా వున్న నాకు మావారి మాటలతో ఇంకా భయం వేసింది.

ప్రయాణం నాలుగురోజుల్లోకి వచ్చింది. మావారు రోజూ వర్క్‌కి

వెళ్ళేముందు 'రాయడం అయిందా? అంతా ఫైనల్ అనుకున్నాక బట్టీ పట్టు. ఆ తర్వాత ఎలా చెప్పాలో ప్రాక్టీసు చెయ్యి– – – –" అంటూ రోజుకో రకంగా ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి వెళ్తున్నారు.

ఇంట్లో బోలెడు పనులు. దానికితోడు ఇంట్లో రిపేరు వర్కు ఒకటి. వాళ్ళకీ ఇప్పుడే కుదిరింది. ధన్– – – –ధన్– – ధన్ అంటూ రోజూ ఒకటే చప్పుళ్ళు. ప్రయాణానికి పెట్టె సర్దుకోవాలి. . . అంతా గాబరా గాబరా. . గ వుంది.

నాకున్న టెన్షన్ చాలదన్నట్టు ఒకరోజు మా అమ్మాయి ఫోన్ చేసి, "నేను సర్దేసుకున్నాను. నీ సర్దుడు అయిందా? శాటర్‌డే ఏం చీరె కట్టుకుంటున్నావూ? ఆ చీరెమీదకి మాచ్ అయ్యే నగలు ఉన్నాయా?" అంటూ మొదలుపెట్టింది.

మూడ్‌లో లేని నేను 'ఇంకా ఏమీ అనుకోలేదు. ఏదో ఒక చీరె కట్టుకుంటాను. ఇదేమీ ఫాషన్ పెరేడు కాదుకదా' అన్నాను. అది వెంటనే, " నిజమే, బట్ ఇట్ ఈజ్ యువర్ స్పెషల్ డే యు షుడ్ లుక్ నైస్" అంటూ " పెన్నులు బాగా దగ్గరుంచుకోవడం మర్చిపోకు" అంది. 'అన్ని పెన్నులు ఎందుకూ?' అన్నాను. 'ఎందుకేమిటీ? అక్కడ అందరూ నీ పుస్తకాన్ని సైన్ చెయ్యమని అడుగుతారు. ఆ టైములో పెన్ దగ్గర లేకపోతే బావుండదు. నాన్న నీకు గిఫ్ట్ గా ఇచ్చిన పెన్ను మాత్రం మర్చిపోకు. . .

బుక్స్ గిఫ్టు రాప్ చెయ్యాలి. నాన్నకు గుర్తు చెయ్యి. ఛీ ఛీ . . . ఆ మామూలు గిఫ్ట్ రాప్ కాదు. స్పెషల్ రాప్ తీసుకోమని నాన్నకు చెప్పా.. అన్నట్టు నాన్నతో మాట్లాడాలి, ఇంట్లో వున్నారా?" అంది.

"వున్నారు కాని, ఏదో ఆఫీసు పేపర్లు చూసుకుంటున్నారే" అన్నా సందేహిస్తూ. అది వెంటనే "ఫరవాలేదులే, ఫోను నాన్నకివ్వు" అంటూ ఆర్డరు వేసింది.

నాకెప్పుడూ పెద్ద అనుమానం. 'తల్లిని నేనా లేక ఇదా?' అని. అంతేకాదు ఇది నాకు అత్తగారే అనిపిస్తుంది! లోపల వుడుక్కుంటూనే పైకి ఏమీ అనలేక పక్కరూములో వున్న మావారి దగ్గరకు వెళ్ళి "మీ అమ్మాయి ఫోనులోవుంది మీతో ఏదో మాట్లాడాలిట" అంటూ ఫోను చేతికిచ్చాను.

మావారు వెంటనే "చెప్పు తల్లీ" అంటూ వినయంగా అడిగారు. నేను కిందకు వెళ్ళి పనివాళ్ళు చేసిపోయిన మెస్ క్లీన్ చేసుకుంటూ, నా ఉపన్యాసం వల్లెవేసుకుంటుంటే మావారు గట్టిగా పిలిచారు. 'ఒకసారి పైకి రా' అంటూ. తీరా పైకి వెళ్ళి చూద్దునుకదా చిలకమర్తి వారి 'గణపతి' కి మల్లే అటకెక్కి కూర్చున్నారు.

నాకు ఒళ్ళుమండిపోయి " రేపు ప్రయాణం పెట్టుకుని ఇప్పుడు అటకెక్కారెందుకూ?" అన్నాను. "అబ్బ. కంగారు పడకు. నీకోసమే ఎక్కా! జ్యోతి వీడియో కెమేరా పనిచెయ్యటంలేదుట. మనది తీసుకురమ్మంది. అది ఫోటోలు తీస్తుందిట. నన్ను వీడియో తీయమంది. . . .కాస్త ఇది అందుకో" అంటూ పదేళ్ళనాటి వీడియో కెమేరా వున్న భోషాణం బ్యాగు అందించారు.

మర్నాడు పదింటికి మమ్మల్ని ఎయిర్ పోర్ట్‌కి తీసికెళ్ళడానికి కారు వచ్చింది. మావారు హడావిడి పడుతూ, నేను కంగారుపడుతూ అనుకున్నటైముకు బయలుదేరాం. కారు హైవే మీద జోరుగా వెళ్తోంది.

బాగా అలసటగా అనిపించి నేను సీటు వెనక్కి వాలి కళ్ళుమూసుకుని కాస్త రిలాక్స్ అవుతుంటే వున్నట్టుండి మావారు, " రాసుకున్నకాగితం నీవెంట తెచ్చుకుంటున్నావుకదా?" అని గదమాయించినట్టు అడిగారు.

ఒక్కసారి ఉలిక్కిపడి వెంటనే హాండుబ్యాగు తెరిచి చూసుకున్నాను. కాగితాలు కనిపించలా! కంగారుగా వెతకటం మొదలుపెట్టా.

"అంత ముఖ్యమైనవి– – – ఎలా – – – మరిచిపోయావ్– – ఇప్పుడు వెనక్కి – – –అంటూ మొదలెట్టారు . . . .

అప్పుడు గుర్తొచ్చింది. అవి నా సూటుకేసులో చీరలమధ్య భద్రంగా వున్నాయని. నేను రాసుకున్నది పేజీన్నరే. అయినా నామీద ఏమాత్రం నమ్మకం లేని మావారు, మా అమ్మాయి సలహామేరకు తాటికాయలంత అక్షరాలతో టైపుచేసి దాన్ని ఐదు పేజీలు చేశారు. అది నా బ్యాగులో పట్టకపోవడంతో సూటుకేసులో పెట్టానన్న సంగతి గుర్తొచ్చి ఊపిరిపీల్చుకున్నాను.

మొత్తానికి మధ్యాన్నం 3 గంటలకు సదస్సు జరిగే హోటలుకు చేరుకున్నాం. అర్జెంటుగా ఏదన్నా తిని కాసేపు హాయిగా పడుకోవాలని డిసైడ్ అయిపోయా.

మావారు మాత్రం ఆ రిసెప్షనిస్టు మా రూముకీ ఇచ్చేసినా, అక్కడినుంచి కదలకుండా 'రేపు జరగపోయే లిటరరీ సింపోజియమ్‌కు వచ్చామని, అందులో మా ఆవిడ రాసిన పుస్తకం రిలీజ్ అవుతుందనీ ఆ టైములో ఏమాత్రం ఖాళీగా వున్నా తప్పకుండా రమ్మం' టూ ఆ అమ్మాయిని తినేస్తున్నారు.

ఆ పిల్ల, మనసులో 'హూ కేర్స్?' అనుకుని పైకి మాత్రం వండర్ ఫుల్, మై కంగ్రాట్యులేషన్స్ టు హెర్ అంటూ సంతోషం ప్రకటించింది. మావారు 'థ్యాంక్యు, థ్యాంక్యూ' అంటూ 'వేరీజ్ ది కంవ్వెషన్ హాల్?' అని అడిగారు.

ఆ అమ్మాయి 'ఇట్ ఈజ్ రైట్ దేర్' అంటూ చూపించింది. మావారు సామాను అక్కడే వదిలేసి నా చేయి పట్టుకుని చూద్దాంరా అంటూ లాగారు.

అబ్బ, తరువాత చూసుకోవచ్చుకదా అనుకుని చెప్పినా వినేరకం కాదు కనుక తప్పనిసరిగా వెంట వెళ్ళాను. నాలుగడుగులు వేసామోలేదో ఓ చిన్న

హాలు, దానికి తగ్గట్టే చిన్న స్టేజి, మూలగా ఓ మైకు కనిపించాయి. నేను మనసులో హాలు పొందిగ్గా వుందనుకుంటుంటే, మావారు బాగా నిరుత్సాహంతో ‘ఇదేమిటీ ఇంత చిన్నదిగా వుంది? రేపు పైవూళ్ళనుంచి ఎంతోమంది వస్తారు. ఇంకా లోకల్‌గా వుండే తెలుగువాళ్ళు బోలెడుమంది వస్తారు. ఇదేం సరిపోతుంది? ఈ అమ్మాయి గ్యారంటీగా మనకు తప్పు ఇన్‌ఫర్మేషన్ ఇచ్చింది‘ అంటూ మళ్ళీ ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళారు.

నాకు మాత్రం ఆ హాలు చూడగానే ప్రాణం కాస్త కుదుటపడింది. ఫరవాలేదు ఎలాగో మేనేజ్ చెయ్యచ్చనుకున్నాను.

ఈలోగా ఆ అమ్మాయి, 'ఇదే మా గ్రాండ్ బాల్ రూము. నీ తెగులు సింపోసియమ్ గ్రాండ్‌స్కేల్‌లో రేపు జరిగేది ఇక్కడే‘ అని నొక్కి వక్కాణించింది.

పాపం మావారి మొహం చూడాలి! అంతలోనే తిప్పుకుని అందులో ఎంతమంది పడతారో, ఎన్ని ఎక్స్‌ట్రా చైర్లు వెయ్యచ్చో అంచనావేసి, స్టేజిమీదకెళ్ళి ఓ ప్రదక్షిణం చేసి, కర్టెన్లు వగైరా పరీక్షించి గబగబ వచ్చి ముందు లైన్లో ఓ కుర్చీ ఆక్రమించుకున్నారు.

"ఇదేమిటీ ఇక్కడ కూర్చుంటారు లేవండి రూముకెళ్దాం. ఏదైనా తిని కాసేపు రెస్టు తీసుకుందాం" అన్నా పొద్దుటినుంచి తిండి, రెండురోజులనుంచి నిద్ర లేని నేను.

"ఇప్పుడు నిద్రేమిటి నీ మొహం ఎటూకానివేళ. ఇంకాసేపట్లో జ్యోతి కూడా వచ్చేస్తుంది. అప్పుడు ముగ్గురం కలిసి తిందాం. ఈలోపు నువ్వు నీ స్పీచ్ ప్రాక్టీసు చెయ్యి. అక్కడ మైకుముందు నుంచొని మాట్లాడు" అంటూ వెళ్ళి మూడోవరసలో మధ్యలో కూర్చున్నారు.

ఓ పక్క కడుపులో ఎలకలు పరిగెడుతుంటే మరోపక్క కళ్ళు మూసుకుపోతుంటే ఇదెక్కడిగొడవరా అనుకుంటూ స్టేజీ ఎక్కి మైకుముందు నిల్చొని మాట్లాడ్డం మొదలుపెట్టా. . . . ఓ రెండు నిముషాలు మౌనంగా వున్నారేమో అంతే అక్కడినుంచి ప్రతిక్షణానికి ఆపి మైకుకు దూరంగా నిల్చున్నావు. . . ఒక్కముక్క వినిపించటంలేదు . . . వాయిస్ ఫ్లాట్ గా వుంది. . . . మొహం అలా దించుకుంటే రేపు వీడియోలో నీ పాపిడే కనిపిస్తుంది" అంటూ నిర్దాక్షిణ్యంగా నన్ను, నా ఉపన్యాసాన్ని విమర్శించటం మొదలుపెట్టారు.

ఇంతలో "హాయ్ అమ్మా" అంటూ మా అమ్మాయి వచ్చి నన్ను రక్షించింది.

మర్నాడు ఉదయం సాహితీసదస్సు తంచనుగా అనుకున్న టైముకు ఆలస్యంగా మొదలైంది.

సభకు విచ్చేసిన ప్రత్యేక అతిథులు శ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాదుగారు, మంథా భానుమతిగారు, అక్కిరాజు సుందరరామకృష్ణగారు, అఫ్సర్ గారు, బి.ఎస్. రాములుగారు వేదిక అలంకరించి చక్కని ఉపన్యాసాలు వినిపించారు. ఆ తరువాత పుస్తకఆవిష్కరణలు జరిగాయి. రచయిత్రులందరిని వేదికమీదకు ఆహ్వానించారు. భానుమతిగారు నా అమెరికా ఇల్లాలి ముచ్చట్లు పుస్తకాన్ని ఆవిష్కరించారు. నాకు చాలా ఆనందంవేసింది! నిజంగానే నేను ఏమీ మాట్లాడే అవసరం రాకపోవడం నాకు హాయిగా అనిపించింది. నా సీటు దగ్గరకు వచ్చి తర్వాత జరగబోయే కార్యక్రమాన్ని ఎంజాయ్ చెయ్యటానికి సర్దుకు కూర్చుంటున్నా.

ఎందుకంటే ప్రోగ్రాం షీటు ప్రకారం నేను మాట్లాడేది సాయంకాలం 5గం:లకు అనివుంది. దాని గురించి వర్రీ అవటానికి చాలా టైముందిలే అనుకుంటూ సీటులో వెనక్కి వాలాను.

ఇంతలో, "అనివార్యకారణాలవల్ల కార్యక్రమంలో కొన్ని మార్పులు చేసాం. ఇప్పుడు శ్యామలగారిని వేదికమీదకు వచ్చి వారు ఎంచుకున్న అంశంపై మాట్లాడవలసిందిగా కోరుతున్నాం" అని వినిపించింది.

నేను ఇంకెవరినైనా పిలుస్తున్నారేమో అని అటుఇటు చూస్తున్నాను.

మావారు వెంటనే నా భుజమ్మీద ఒక పోటు పొడిచి "నిన్నే పిలుస్తున్నారు వెళ్ళు" అంటూ ముందుకు తోసారు. నాకు ముచ్చెమటలు పోశాయి.

మావారు నాకోసం ప్రత్యేకంగా గుండ్రాయంత అక్షరాలతో టైప్ చేసిన కాగితాల కట్ట కావలిసింది సాయంకాలం కదా అని రూములోనే వదిలేసా. ఇప్పుడెలాగా అనుకొని ఆంజనేయుడ్ని స్మరించుకుంటూ స్టేజి ఎక్కాను. ఎలాగో అలా అయిందనిపించా.

నాకు స్ఫూర్తినిచ్చిన వారెవరో, ఎందుకు రాయాలనిపించిందో, నా ఉద్దేశ్యమేమిటో . . . . ఇలా కాసేపు ఏదో మాట్లాడేసాను. చివరికి ఏవో చప్పట్లు కూడా వినిపించాయి. స్టేజీ దిగిరాగానే వీడియో కెమేరాతో వున్న మావారు, స్టిల్ కెమేరా చేతిలోపుచ్చుకుని వున్న మా అమ్మాయి "గుడ్ జాబ్" అంటూ హగ్ ఇచ్చారు!

అత్తగారిలాంటి మా అమ్మాయి, అచ్చమైన మొగుడిలాంటి మావారు గుడ్‌జాబ్ అన్నారంటే హమ్మయ్య ఫరవాలేదు అని ఊపిరి పీల్చుకున్నాను.

ఆ తర్వాత ఒకళ్ళిద్దరు "బాగా మాట్లాడారు, మీకు భయం వున్నట్టు అస్సలు అనిపించలేదు" అంటూ పాపం నామీద జాలితో కాంప్లిమెంట్స్ కూడా ఇచ్చారు.

ఎన్నడూ వేదిక ఎక్కి మాట్లడని నేను, ఈ రోజు ఎలా మాట్లాడగలిగానా అని ఆశ్చర్యంతో పాటు, ఇన్నాళ్ళూ ఈ టాలెంటుని వాడుకోకుండా వృధా చేసానే అని బాధకూడా పడ్డాను. కాస్త మత్తు వదిలాక జాగ్రత్తగా పరిశీలిస్తే నా విజయానికి కారణం "అనుకూలమైన వాతావరణం" అని బోధపడింది.

*<u>తెలుగు భాషలో నిష్ణాతులు, ఏ అంశం మీద అయినా గంటలకొద్దీ అనర్గళంగా మాట్లాడగలిగిన పెద్దలు ముందు వరసలో ఎదురుకుండా వుంటే వారిని చూస్తూ ఎలా మాట్లాడటం?</u>* అని నా మొదటి భయం.

ప్రోగ్రాం తారుమారు అవడంవల్ల ఉదయం వేదికలెక్కిన ప్రముఖులందరూ ఇంకా వేదికమీదే, అందులోనూ నా వెనకాలగా వుండటం నా అదృష్టం!

*ఇక నా రెండో బాధ ప్లస్ నచ్చనిది <u>"స్టేజి లైటింగ్"!.</u>*

మామూలుగా స్టేజిని ఫోకస్ చేస్తూ వుండే ఫ్లడ్ లైట్ల వేడికి చికాకుతోపాటు వెంటనే తలనొప్పికూడా వచ్చేస్తుంది. కానీ ఈ వేదికమీద లైటు వుండీ లేనట్టుగా అందులోను మైకు వున్నచోట అసలే లేకపోవడం నాపాలిట వరం అయింది.

*ముచ్చటగా నా మూడో భయం. <u>"పెద్దహాల్లో జనం కిటకిటలాడుతూ, గోలగోలగా మాట్లాడుకుంటూవుంటే నేను మాట్లాడటం ఎలా?"</u> అని.*

కానీ నాలాంటి వాళ్ళకోసమే అన్నట్టు ముద్దొచ్చే ఆడిటోరియంలో స్టేజిమీద వున్న ప్రముఖులు పోగా మిగిలిన నలుగురూ (అందులో ఇద్దరు నావాళ్ళే!) అక్కడక్కడా కూర్చోడంతో నా స్టేజ్ ఫియర్ ఎక్కడికో ఎగిరిపోయింది!

ఇక సదస్సుకు వచ్చిన శొంఠి శారదాపూర్ణగారు, ఇయ్యుణ్ణి ఉమగారు, ద్వాదశి శర్మగారు, దేవరాజుమోహన్ గారు, నారాయణస్వామిగారు, అఫ్సర్ గారు, నచకీగారు తదితరులు అందరూ ఎంతో నిరాడంబరంగావుండి, నవ్వుతూ, నవ్విస్తూ చక్కని వాతవరణాన్ని సృష్టించారు. అక్కిరాజు సుందరరామకృష్ణగారు సదస్సు ఆరంభంనుంచి ఆద్యంతం వరకు వారి శ్రావ్యమైన గొంతుతో పద్యాలు వదులుతూ, ఛలోక్తులు విసురుతూ హాస్యాన్ని చక్కగా పండించారు!

ఇక శనివారం సాయంత్రం వేగేస్న సంస్థ అధ్యక్షులు వంశీరామరాజుగారి ఆధ్వర్యంలో సురేఖామూర్తిగారు, బాల కామేశ్వర రావు గారు ఘంటసాలవారి మధురగీతాలు అద్భుతంగా పాడి ప్రేక్షకులను అలరించారు.

ఇండియానాపోలిస్ 'గీత' సంస్థవారు అచ్చమైన తెలుగు భోజనాలు వడ్డించి వచ్చినవారందరికి చక్కని అతిధిమర్యాదలు చేశారు.

ఒక కుటుంబంలా రెండు రోజులు గడిపిన అందరం ఈమెయిలు ఎడ్రస్సులు, ఫోను నెంబర్లు తీసుకుని వీడ్కోలు చెప్పుకున్నాం.

ఇంటికొచ్చాక సదస్సులో నేనిచ్చిన స్పీచ్, ప్రముఖుల పక్కనవుండి తీయించుకున్న ఫొటోలు చూసుకుని మురిసిపోయానని మీరు అనుకుంటున్నారేమో. ఏదో సామెత చెప్పినట్టు వీడియో వీక్షించటమే కాని వాడటం అలవాటులేని మావారు "స్టాండ్ బై" లో పెట్టేసి బ్రహ్మాండంగా తీసేస్తున్నానని భ్రమపడ్డారట! ఇక మా అమ్మాయి తన స్టిల్ కెమేరాకు బ్యాటరీలు తెచ్చుకోవడం మర్చిపోయిందట! ఆ సంగతి నేను స్టేజి ఎక్కాక కెమేరా ఆన్ చేసినప్పుడుగానీ తెలియలేదుట!!

ఎంతో చక్కగాజరిగిన నా పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం, నేను కష్టపడి అద్భుతంగా ఇచ్చిన ఉపన్యాసం తాలూకు సాక్ష్యాలేవీ లేకుండా చేసిన మావారిమీద, మా అమ్మాయి మీద దావా వేద్దామని చూస్తున్నా.

*ఓ మంచి లాయరుకోసం చిట్టెన్ రాజుగారికి ఫోను చెయ్యాలి రేపు!!!*